గురువారం 4 జులై 2024
https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

**ఢిల్లీ చేరుకున్న సీఎం చంద్రబాబు**

- ఎన్డీయే ఎంపీలకు విందు ఇచ్చిన ముఖ్యమంత్రి
- నేడు ప్రధాని, కేంద్రమంత్రులతో భేటీ

7

**పారిశ్రామిక రంగాన్ని జగన్ గాలికొదిలేశారు**

- మంత్రి టీజీ భరత్ ధ్వజం

3

# అమరావతి అభివృద్ధితోనే ఏపీ ప్రగతి

## ఉపాధి కల్పన, సంపద సృష్టి.. పేదరిక నిర్మూలనకు కేంద్రం




- 26 జిల్లాల ఆదాయ వనరు
- 175 నియోజకవర్గాల యువతకు ఉద్యోగాల కల్పతరువు
- ప్రతి పంచాయతీ సంక్షేమానికి భరోసా ప్రజారాజధాని
- ప్రతి తెలుగుబిడ్డ గర్వించే ప్రపంచస్థాయి నగరం
- అమరావతి విధ్వంసం జగన్ తెలుగుజాతికి చేసిన ద్రోహం
- విధ్వంస పాలనకు జగన్ ఒక కేస్ స్టడీ
- తెలంగాణకు హైదరాబాద్ లాగా... ఏపీకి అమరావతి సంపద కేంద్రం అయ్యేది
- ప్రజలు మాపై పెట్టుకున్న నమ్మకాన్ని నెరవేరుస్తాం... రాజధానిని పునర్నిర్మిస్తాం
- అమరావతిపై నమ్మకాన్ని మళ్లీ నిలబెడతాం.. కేంద్ర సాయంతో ముందుకు సాగుతాం
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటన
- రాజధాని అమరావతిపై శ్వేతపత్రం విడుదల చేసిన సీఎం

- వివరాలు 2 లో..

### పొలిటికల్ పెన్‌కౌంటర్



మాజీ సీఎం వైఎస్ జగన్ గురువారం నెల్లూరుకు వెళ్తారు. హత్యాయత్నం సహా వివిధ నేరాల కింద అరెస్టై నెల్లూరు సెంట్రల్ జైల్లోవున్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పరామర్శిస్తారు. ఎన్నికల బూత్‌లోకి చొరబడి ఈవీఎంను ధ్వంసం చేసిన కేసులోనూ పిన్నెల్లి విచారణ ఎదుర్కొంటోన్న విషయం తెలిసిందే.

జూలులేని సింగంలా
మాచర్లలో తిరిగినాడు!
దెబ్బతిన్న.. పిన్నెల్లి
జైలు పిల్లి అయినాడు!!

కలిసివచ్చె కాలమంత..
అధికారపు వెలుగులోన-
చుట్టుముట్టె కేసులెన్నొ..
గెలుపులేని సమయాన!

జగను ప్రేమ ఎంతగొప్ప
పిన్నెల్లిని పలకరించ!
జైలులోన పరామర్శ..
దుర్మార్గం పులకరించ!!

ఇంతబతుకు బతికినాక
ఇంటెనకే వచ్చినట్టు..!
పిన్నెల్లిని కలవగానె
పరువు పోక పోతే ఒట్టు!!

-మహాదేవ

# 8 నుంచి ఉచితంగా ఇసుక

- విధి విధానాలు ఖరారు చేయాలని సీఎం ఆదేశించారు
- నిర్మాణ రంగాన్ని పునరుద్ధరించి కార్మికులకు ఉపాధి కల్పిస్తాం
- బ్లాక్ మార్కెట్‌ను అరికట్టి ధరలను నియంత్రిస్తాం
- ఇసుక కుంభకోణంలో దొంగలను గుర్తించి శిక్షిస్తాం
- గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర

3






## 'ప్రజాదర్బార్'కు భారీ స్పందన

- పెద్దఎత్తున తరలివస్తున్న ప్రజలు
- సమస్యల పరిష్కారానికి యువనేత భరోసా

- వివరాలు 4 లో..

పట్టిసీమను జగన్ ఒట్టిసీమన్నారు..

### ఇప్పుడదే బంగారమయింది: నిమ్మల

- కృష్ణాడెల్టాకు నీరు విడుదల చేసిన మంత్రి
- నదుల అనుసంధానానికి చంద్రబాబు శ్రీకారం చుట్టారు
- ఇరిగేషన్ వ్యవస్థను జగన్ విధ్వంసం చేశారు
- చుక్కనీరు కూడా వృథా కాకూడదనేది చంద్రబాబు ధ్యేయం



5

### ఊరూరా మీసేవ!

- మహిళా స్వయం సహాయక సంఘాలకు మంజూరు
- ఆపరేటర్లుగా ఇంటర్ చదివిన సభ్యురాళ్ల ఎంపిక
- ఒక్కో కేంద్రానికి రూ.2.50 లక్షల రుణం

8 లో

అభ్యర్థులకు తగిన సమయం ఇచ్చేలా

### టెట్, డీఎస్సీ పరీక్షల తేదీలు

5

అసెంబ్లీ గేటు కూడా తాకలేవని వైసీపీ నేతలు అంటే...

### మీరు డిప్యూటీ సీఎంను చేశారు

- పిఠాపురం ప్రజలకు పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు

3

పిల్లలపై పిడుగు పేరుతో...

### సాక్షిలో తప్పుడు రాతలు

- మండిపడ్డ టీడీపీ నేత విజయ్ కుమార్



8

# 8 నుంచి ఉచితంగా ఇసుక

- విధి విధానాలు ఖరారు చేయాలని సీఎం ఆదేశించారు
- నిర్మాణ రంగాన్ని పునరుద్ధరించి కార్మికులకు ఉపాధి కల్పిస్తాం
- బ్లాక్ మార్కెట్‌ను అరికట్టి ధరలను నియంత్రిస్తాం
- ఇసుక కుంభకోణంలో దొంగలను గుర్తించి శిక్షిస్తాం
- గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర




అమరావతి : ఉచిత ఇసుక పాలసీ విధానంతో నిర్మాణ రంగాన్ని పునరుద్ధరించి ఆ రంగంపై ఆధారపడిన కార్మికులకు పెద్దఎత్తున ఉపాధి కల్పించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నారు. ఈ నెల 8 నుంచి ఉచిత ఇసుకను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలతో విధి విధానాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఉచిత ఇసుకకు సంబంధించి రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర బుధవారం రాష్ట్ర సచివాలయం పబ్లిసిటీ సెల్‌లో విలేఖరులతో మాట్లాడారు. ఇసుక పాలసీని తీసుకువచ్చి ప్రజలకు ఉచితంగా ఇసుకను అందుబాటులో ఉంచుతామని, నూతన పాలసీని అన్ని జిల్లాల్లో కలెక్టర్లు మానిటర్ చేస్తారని వెల్లడిరచారు. గత ప్రభుత్వం అనుసరించిన ఇసుక విధానం వల్ల రాష్ట్రంలో నిర్మాణ రంగమంతా కుదేలు అయిందని, ఇసుకను ఆదాయ వనరుగా భావించి పేదల ప్రజల నోట్లో మట్టికొట్టిందన్నారు. దానిపై ఆధారపడ్డ 40 రంగాలకు చెందిన కార్మికులు రోడ్డున పడ్డారని తెలిపారు. ప్రైవేటు ఏజెన్సీలకు గత ప్రభుత్వం ఇసుకను అమ్ముకోవడం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకునే అంశంపైనే దృష్టి సారించడం వల్ల కోట్లాది మంది కార్మికులు నష్టపోయారన్నారు. అటువంటి పరిస్థితులు రాష్ట్రంలో పునరావృతం కాకుండా ఉచితంగా ఇసుకను అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చి నిర్మాణ రంగానికి పునరుజ్జీవం పోసేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. గత ప్రభుత్వం అనుసరించిన ఇసుక విధానం నిలిపివేతలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలను త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సెప్టెంబరు లోపు రీచ్‌ల నుంచి ఇసుక తవ్వకాలకు సాధ్యం కాదని, అయితే అధికారికంగా, అనధికారికంగా ఉన్న ఇసుక స్టాక్ పాయింట్లను, సిల్ట్‌లను గుర్తించి వాటిలో అందుబాటులో ఉన్న చోట్ల ఇసుకను ఈ నెల 8వ తేదీ నుంచి ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తామని వెల్లడిరచారు. రానున్న మూడు మాసాల పాటు దాదాపు కోటి టన్నుల ఇసుక అవసరం అవుతుందని అంచనావేయడం జరిగిందన్నారు. స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక రవాణా చేసే వాహనాల చార్జీలను కూడా నియంత్రించి అతి తక్కువ ధరలకే ఇసుక రవాణా అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇసుక బ్లాక్ మార్కెటింగ్ చేస్తే తీవ్రమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనధికారిక ఇసుక రీచ్‌లను అదుపులోకి తీసుకుని ఉచిత ఇసుక పాలసీని పూర్తిస్థాయిలో అమలు చేస్తామని వెల్లడిరచారు.

### ఇసుక కుంభకోణంలో దొంగలకు శిక్ష తప్పదు

జగన్‌రెడ్డి ప్రభుత్వంలో భవన నిర్మాణ రంగం కుదేల్కెంది. దానిపై ఆధారపడిన కార్మికులు రోడ్డున పడ్డారు. వారిని యాచించే దుస్థితికి తీసుకువచ్చారు. అనుమతులతో సంబంధం లేకుండా ఇసుక తోడుకున్నారు. కేంద్రం, ఎన్జీటీ నుంచి మొట్టికాయలు వేసినా పట్టించుకోలేదు. ఇసుక కుంభకోణంలో దొంగలకు శిక్ష తప్పదు. రావాల్సిన బకాయిలన్నీ రాబడుతాం. మూసివేసిన రీచ్‌లు తెరుస్తాం. టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసి కలెక్టర్ ఆధ్వర్యంలో ఇసుక రవాణా సక్రమంగా జరిగేలా చూస్తాం. రికార్డులను తనిఖీ చేసి ఒక్కొక్క దానిని సరిదిద్దుకుంటూ ముందుకు వెళతాం. ప్రస్తుతం శాఖలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడానికి 15 రోజులకు పైగా సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారని వివరించారు.

# పారిశ్రామిక రంగాన్ని జగన్ గాలికొదిలేశారు

## మంత్రి టీజీ భరత్ ధ్వజం

- అశోక్ లేలాండ్ కంపెనీకి కూడా పారిపోయే పరిస్థితి తెచ్చారు
- మల్లవల్లి పారిశ్రామికవాడను అభివృద్ధి చేస్తాం
- పరిశ్రమలు పెట్టేవారికి సీఎం చంద్రబాబు అండగా ఉంటారు



గన్నవరం:ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక రంగాన్ని గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసిందని పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్ అన్నారు. ఏపీలో పారిశ్రామికవేత్తలు ఆందోళనలో ఉన్నారని, వైసీపీ పాలనలో వారిని పట్టించుకున్న నాథుడే లేడని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్డీయే ప్రభుత్వంలో పారిశ్రామికవేత్తలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. గన్నవరం పారిశ్రామికవాడను స్థానిక ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తో కలిసి మంత్రి టీజీ భరత్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ..ఒక పరిశ్రమ రావాలంటే నీరు, రోడ్లు, డ్రెయిన్, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలి. ఆ విషయంలో జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మల్లవల్లి పారిశ్రామికవాడలో నీటి సమస్య ఉంది, దాన్ని త్వరలోనే పరిష్కరిస్తాం. గత వైసీపీ పాలనలో అశోక్ లేలాండ్ సంస్థ రాష్ట్రం విడిచి పారిపోయే పరిస్థితి కల్పించారు. టీడీపీ ప్రభుత్వంలో దాన్ని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తాం. చంద్రబాబు ముఖ్యమంత్రి అవ్వగానే అశోక్ లేలాండ్ కంపెనీ తిరిగి మల్లవల్లిలో యూనిట్ నడిపేందుకు ఆసక్తి చూపుతోంది. వైసీపీ పాలనలో పరిశ్రమలకు భూమి కేటాయింపు ధరలు విపరీతంగా ఉన్నాయి. చంద్రబాబు సర్కార్‌లో ఈ విషయంపై ఆలోచించి నిర్ణయం తీసుకుంటాం. మల్లవల్లి ఇండస్ట్రీలో ఉన్న చిన్నచిన్న సమస్యలు పరిష్కరించి, దాన్ని ఒక బ్రాండ్‌గా మారుస్తా. ఏపీలో పరిశ్రమలు పెట్టేందుకు వచ్చే సంస్థలకు చంద్రబాబు సర్కార్ అండగా ఉంటుందని మంత్రి చెప్పారు.

గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ..గత టీడీపీ ప్రభుత్వంలో మల్లవల్లి పారిశ్రామికవాడలో 478 కంపెనీలకు స్థలాలు కేటాయించారు. ఈ ప్రాంతంలో ఇప్పుడు ఎన్ని కంపెనీలు నడుస్తున్నాయో వైసీపీ నేతలు చెప్పాలి. మల్లవల్లి పారిశ్రామికవాడ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. వీరపనేనిగూడెం, మల్లవల్లి పారిశ్రామికవాడలను జగన్ ప్రభుత్వం గాలికి వదిలేసింది. నియోజకవర్గ ప్రజలు వలస వెళ్లే దుస్థితి లేకుండా వారికి ఇక్కడే ఉపాధి కల్పించేలా చంద్రబాబు సర్కార్ చూసుకుంటుంది. త్వరలోనే మరికొన్ని కంపెనీలు తెచ్చేందుకు మంత్రి భరత్ ముందుకు వచ్చారు. మల్లవల్లి ఇండస్ట్రీ గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని మంత్రి హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి భరత్ సహకారంతో పారిశ్రామికవాడను రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా నిలుపుతామని ధీమా వ్యక్తం చేశారు.



## అసెంబ్లీ గేటు కూడా తాకలేవని వైసీపీ నేతలు అంటే...

# మీరు డిప్యూటీ సీఎంను చేశారు

## - పిఠాపురం ప్రజలకు పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు

పిఠాపురం: తనను అసెంబ్లీ గేటు కూడా తాకనివ్వబోమని వైసీపీ నేతలు సవాల్ చేస్తే పిఠాపురం ప్రజలు ఉప ముఖ్యమంత్రిని చేశారని జనసేనాని పవన్ కళ్యాణ్ అన్నారు. గేటు తాకడం కాదు.. దాన్ని బద్దలు గొట్టుకుని పవన్ కళ్యాణ్ అసెంబ్లీలో ఆడుగుపెడతారని టీడీపీ నేత వర్మ అన్న మాటలు నిజమయ్యాయని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. బుధవారం సాయంత్రం పిఠాపురంలో నిర్వహించిన వారాహి సభలో ఆయన మాట్లాడుతూ పిఠాపురం ప్రజలు ఇచ్చిన బలం దేశ రాజకీయాల్లో సైతం జనసేన గురించి మాట్లాడుకునేలా చేసిందన్నారు. ఒక్కడి కోసం ఇంతటి ఘన విజయం అందించారు.అందుకు రెండు చేతులెత్తి నమస్కరిస్తున్నా. డొక్కా సీతమ్మ స్ఫూర్తితో కష్టంలో ఉన్న మనిషికి అండగా నిలవాలనుకున్నా. మీరు డిప్యూటీ సీఎం దాకా తీసుకొచ్చారు. ఒక పార్టీ 100 శాతం స్ట్రయిక్ రేటుతో విజయం సాధించటం దేశంలో ఇప్పటి వరకు ఎవరూ చూడలేదు. పవన్ కళ్యాణ్‌ను అసెంబ్లీ గేటు కూడా తాకనీయమని వైసీపీ నేతలు సవాల్ చేశారు. దాన్ని పిఠాపురం ప్రజలు సీరియస్ గా తీసుకున్నారు. గేటు తాకడం ఏంటి బద్దలుగొట్టుకుని వస్తారని వర్మ చెప్పారు. ఆ మాటలు నిజమయ్యాయి. చాలా మంది నన్ను హోంశాఖ తీసుకోమని చెప్పారు. కానీ, బాపూజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసమే నేను పంచాయతీరాజ్‌శాఖ తీసుకున్నా. నాకు ఎలాంటి లంచాలు అవసరంలేదు. నిధులు సద్వినియోగం కావాలని అధికారులకు చెప్పా. సినిమాల్లో నాకు వచ్చిన ఆదాయంతో పన్నులు కట్టాను. ఇప్పుడు మీ డబ్బు కాబట్టే ప్రతి రూపాయికి అధికారులను లెక్కలు అడుగుతున్నా. బాధ్యతగా ఉండాలనే మా శాఖలో ఖర్చులు తగ్గించుకుంటున్నామని పవన్ చెప్పారు.

### హామీలన్నీ గుర్తున్నాయి

పవన్ కళ్యాణ్ అనే నేను అంటూ మీ ముందు ప్రమాణం స్వీకారం చేస్తున్నాను. అన్ని వర్గాల వారికీ నేను హామీ ఇస్తున్నాను. నేను లంచాలు తీసుకోను. మీ అభ్యున్నతికి పాటుపడతాను. గతంలో వైసీపీ నాయకులు పవన్ కళ్యాణ్ పిఠాపురంలో ఉండడు... హైదరాబాద్లో ఉంటాడని ప్రచారం చేశారు. అందుకే పిఠాపురంలో మూడు ఎకరాలు కొన్నాను. ఇప్పుడే రిజిస్ట్రేషన్ పూర్తయింది. ఉద్యోగాలు లేవని, నీళ్లు రాలేదని ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగి కొడుకును కాబట్టి ఉద్యోగులకు ఎలాంటి గౌరవం ఇవ్వాలో నాకు తెలుసు. ఈ విషయాన్ని పార్టీ నాయకులు కూడా అర్థం చేసుకోవాలి. అధికారులను గౌరవిస్తూనే పనులు చేయించుకోవాలి. తాగునీరు, సాగునీరు, విద్య, వైద్యం, రోడ్లు, ఉపాధి అవకాశాలు వంటి హామీలన్నీ గుర్తున్నాయి. నా కుమార్తె కనిపించడం లేదని ఓ తల్లి వచ్చి తన బాధ నాతో చెప్పుకొంది. ఆమె బాధ తీర్చాలని 3 రోజులు తాపత్రయపడ్డాను. 3 నెలల కేసు చిక్కుముడిని పోలీసులు త్వరగా ఛేదించారు. అదే వైసీపీ ప్రభుత్వం 30 వేల మందికి పైగా ఆడబిడ్డలు కనిపించకుండా పోతే కనీసం పట్టించుకోలేదు. వ్యవస్థల్లో తప్పు లేదని ఈ ఘటనలతో నిరూపితమైంది. వ్యవస్థలను సరిదిద్దుకోవాలని అధికారులు కూడా చెబుతున్నారని పవన్ అన్నారు.

### చేసి చూపించాం

ఓటర్లు రక్తం చిందకుండా ఈ ఎన్నికల్లో ప్రజాస్వామ్య విప్లవం తీసుకొచ్చారు. 151స్థానాలున్న పార్టీని 11 స్థానాలకు పడగొట్టారు. బస్సులు, రైళ్ళు, విమానాల్లో వచ్చి ఓటేసి వెళ్లారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టిన సమయంలో కూడా ఎవరికీ ఇంత మెజారిటీ రాలేదని ఇటీవల స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. కూటమి ప్రభుత్వం పింఛన్లు పంపిణీ చేయలేదని వైసీపీ నేతలు అంటే తొలి రోజే పంపిణీ చేసి చూపించాం. ఒక్క వాలంటీరు సాయం లేకుండానే ప్రభుత్వ యంత్రాంగం పనిచేసింది. చంద్రబాబు అపార అనుభవం అందుకు తోడ్పడింది. పంచాయతీరాజ్ గురించి ఎన్నో ఫైల్స్ చదువుతున్నాను. వైకాపా హయాంలో అడ్డగోలుగా నిధులు దారి మళ్లించారు. రుషికొండకు గుండు చేసి రాజభవనం కట్టించిన రూ.600 కోట్ల ఖర్చులో కొంచెమైనా కేటాయించి ఉంటే రోడ్లు బాగుపడేవి. ఉద్యోగులకు జీతాలు అందేవని పవన్ అన్నారు.

### అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తాం

ప్రధానమంత్రిని కలిసినప్పుడు ఏం చెప్పాలని ఎంపీ ఉదయ్ అడిగారు. ఆయనకు మనం బలం అవ్వాలి కానీ, బరువు కాకూడదని చెప్పాను. ఉప్పాడ తీరం కోత సమస్యకు పరిష్కారం చూపిస్తూ టూరిజంను అభివృద్ధి చేస్తాం. అందమైన కోస్టల్ రోడ్డును నిర్మిస్తాం. పిఠాపురంలో సెరీకల్చర్‌ను అభివృద్ధి చేస్తాం. గొల్లప్రోలులో ఉద్యానపంటల కోసం శీతల గిడ్డంగి నిర్మిస్తాం. కోటగుమ్మం గేట్ వద్ద రైల్వే పై వంతెన కావాలని కేంద్రాన్ని కోరాం. ఏ సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్లినా ఢిల్లీలో మంత్రులు సానుకూలంగా స్పందిస్తున్నారు. ఆర్థికంగా లోటు ఉన్న రాష్ట్రాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలని నేను, చంద్రబాబు ఆలోచిస్తున్నాం. పిఠాపురం ప్రజల విజ్ఞప్తులను తీసుకోవడానికి ప్రత్యేకంగా సిబ్బందిని నియమించా. ఏ వినతులైనా వారు స్వీకరిస్తారు. ఉపాధి, వైద్యం, శాంతిభద్రతల సమస్యలను వెంటనే పరిష్కరిస్తారు. పిఠాపురంలోని శ్రీపాద వల్లభుడి సాక్షిగా మీకు రుణపడి ఉంటా. పదవి ఉన్నా లేకున్నా నాలో ఎలాంటి మార్పు ఉండదు. ఈ ఐదేళ్లలో అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తామని పవన్ కళ్యాణ్ అన్నారు.

# 'ప్రజాదర్బార్'కు భారీ స్పందన

## పెద్దఎత్తున తరలివస్తున్న ప్రజలు | సమస్యల పరిష్కారానికి యువనేత భరోసా

ఆమరావతి(చైతన్యరథం): కష్టాల్లో ఉన్న ప్రజలకు అండగా నిలుస్తున్నారు విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్. మంగళగిరితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి ప్రజలు 'ప్రజాదర్బార్' కు తరలివచ్చి తమ సమస్యలను విన్నవిస్తున్నారు. బుధవారం ఉదయం నుంచే ఉండవల్లి నివాసం వద్ద వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు, యువత, ఉద్యోగు లు, వివిధ సంఘాల ప్రతినిధులు బారులు తీరారు. నేరుగా యువనేతను కలిసి తమ కష్టాలను ఏకరవు పెట్టారు. ప్రతిఒక్కరి వద్ద విజ్ఞాపన పత్రాలు స్వీకరించి, ఆయా సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానని మంత్రి వారికి భరోసా ఇచ్చారు. ఆయా సమస్యలను విభాగాల వారీగా విభజించి సంబంధిత శాఖలకు పంపాలని సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు.



### టిడ్కో ఇళ్ల రుణాన్ని మాఫీ చేయాలి

దివ్యాంగులకు గత టీడీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిన టిడ్కో ఇళ్ల రుణాన్ని మాఫీ చేసి ఆదుకోవాలని గుంటూరుకు చెందిన ఆశయ సాధన దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు నారా లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. దివ్యాంగులైన తమకు సరైన జీవనాధారం లేదు. తమకు ఎన్టీఆర్ నగర్‌లో మంజూరైన టిడ్కో ఇంటికి వడ్డీతో కలుపుకుని రూ.7 లక్షల వరకు రుణం చెల్లించాలని బ్యాంకు వారు ఒత్తిడి చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం తమకు మంజూరు చేసిన ఇళ్లకు తాళాలు కూడా ఇవ్వకుండా వేధింపులకు గురిచేశారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో తమ సొంతింటి కల నెర వేరేలా టిడ్కో ఇంటి రుణాన్ని మాఫీ చేయాలని యువ నేతను కోరారు. సమస్యను విన్న నారా లోకేష్.. చర్చిం చి నిర్ణయం తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

### రైతు కూలీ పెన్షన్ పునరుద్ధరించాలి

తన కుమార్తెకు పూర్తిస్థాయి అంగవైకల్యం ఉందని, ఆ విధంగా దివ్యాంగ పెన్షన్ మంజూరు చేయాలని మంగళగిరికి చెందిన షేక్ భానుభీ, దివ్యాంగ పెన్షన్ కోసం నులకపేటకు చెందిన అంజనేయులు లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఎలాంటి ఆధారం లేని తనకు వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని తాడే పల్లికి చెందిన డి.పెద్దిరాజు కోరారు. విద్యుత్ బిల్లు నెపంతో తొలగించిన తన దివ్యాంగ పెన్షన్‌ను పున రుద్ధరించాలని ఆత్మకూరుకు చెందిన ఆర్.హేమలత విజ్ఞప్తి చేశారు. పుట్టుకతో దివ్యాంగుడినైన తాను డిగ్రీ చదివానని, ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని మంగళ గిరికి చెందిన ఎమ్.వంశీకృష్ణ కోరారు. దుగ్గిరాల మండలం వీర్లపాలానికి చెందిన తనకు రేషన్‌కార్డు మంజూరు చేయాలని అళ్ల సత్యనారాయణరెడ్డి కోరారు. గత ప్రభుత్వంలో నిలిపివేసిన రైతు కూలీ పెన్షన్‌ను పున రుద్ధరించాలని యర్రబాలెంకు చెందిన ఎస్.వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన తనకు నీట్ పరీక్ష ద్వారా బీ-కేటగిరీలో ఎంబీబీఎస్ సీటు వచ్చిందని, ఫీజు రాయితీ కల్పించి ఆదుకోవాలని పల్నాడు జిల్లా అనంతవరానికి చెందిన సీహెచ్.అనూష విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ అండతో తన ఇంటి దారిని కబ్జా చేసి అక్రమ కేసులు నమోదు చేశారని, తగిన న్యాయం చేయాలని మంగళగిరి నియో జకవర్గం శృంగారపురానికి చెందిన పి.శివకుమార్ విజ్ఞప్తి చేశారు.రాష్ట్రంలో ఈవో గ్రేడ్-2 సూపర్ వైజర్స్ పోస్టులకు ఎంపికైన తమకు అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ ఇవ్వకుండా గత ప్రభుత్వం నిలిపివేసిందని, తమను ఆదుకోవాలని ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని లోకేష్ భరోసా ఇచ్చారు.















చైతన్యరథం

## 6న ప్రజావేదిక కార్యక్రమం వాయిదా

అమరావతి: ప్రజా సమస్యల పరిష్కారానికై తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో శనివారం (6వ తేదీ) నిర్వహించాల్సిన ప్రజా వేదిక కార్యక్రమం కొన్ని అనివార్య కారణాల వలన వాయిదా పడింది. తెలుగుదేశం పార్టీ శ్రేణులు, అభిమానులు ఈ విషయం గమనించాలని టీడీపీ జాతీయ కార్యాలయ కార్యదర్శి పరుచూరి అశోక్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## అభ్యర్థులకు తగిన సమయం ఇచ్చేలా టెట్, డీఎస్సీ పరీక్షల తేదీలు

అమరావతి: టెట్, మెగా డీఎస్సీ పరీక్షలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు అభ్యర్థులకు తగిన సమయమివ్వాలని నిర్ణయించింది. అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు ఈనిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. త్వరలోనే టెట్, డీఎస్సీ పరీక్షల తేదీలను ప్రకటించనుంది. ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే 16,347 టీచర్ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ ఫైల్‌పై తొలి సంతకం చేసిన విషయం తెలిసిందే. ఈ మొత్తం ప్రక్రియ 6 నెలల్లో పూర్తిచేసేలా కార్యాచరణ రూపొందించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. కొత్తగా బీఈడీ, డీఎడ్ పూర్తి చేసుకున్న వారికి కూడా మెగా డీఎస్సీలో అవకాశం కల్పించనున్నారు. టెట్, మెగా డీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు మరింత సమయం కావాలని విద్యార్థి,యువజన సంఘాల నేతలు, పలువురు ఎమ్మెల్సీలు లోకేష్‌ను కలిసి విజ్ఞప్తిచేశారు. సన్నద్ధతకు సమయం ఇస్తే బాగుంటుందని కోరడంతో వారి విజ్ఞప్తుల్ని పరిశీలించిన లోకేష్.. విద్యాశాఖ ఉన్నతాధికారులతో సమీక్షించారు. అభ్యర్థులకు టెట్‌కు 90రోజులు,మెగా డీఎస్సీకి 90రోజుల సమయం ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. త్వరలోనే టెట్, డీఎస్సీ నిర్వహణకు కొత్త తేదీలను ప్రభుత్వం ప్రకటించనుంది. మొత్తంగా ఈ ఏడాది డిసెంబర్ లోగా ఉద్యోగాల భర్తీ ప్రక్రియను పూర్తి చేసి 2025 జనవరి నాటికి ఉద్యోగాలు ఇచ్చేలా కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను మంత్రి లోకేష్ ఆదేశించినట్లు సమాచారం.

## ఏపీ నిఘా విభాగాధిపతిగా మహేష్ చంద్ర లడ్హా

**ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం...**

**చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసిన అధికారి**



అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర నిఘా విభాగాధిపతిగా మహేష్ చంద్ర లడ్హాను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. 1998 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన లడ్హా కేంద్ర సర్వీసుల్లో డిప్యుటేషన్ ముగించుకుని మంగళవారం ఏపీ ప్రభుత్వానికి రిపోర్ట్ చేశారు. వెంటనే ఆయన్ను నిఘా విభాగాధిపతిగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు.లడ్హా గతంలో ప్రకాశం, నిజామాబాద్, గుంటూరు జిల్లాల్లో ఎస్పీగా పని చేశారు. హైదరాబాద్ ఈస్ట్ జోన్ డీసీపీగా, జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏలో దాదాపు ఐదేళ్లపాటు ఎస్పీగా, డీఐజీగా విధులు నిర్వర్తించారు. విజయవాడ నగర జాయింట్ పోలీస్ కమిషనర్‌గా, విశాఖ నగర పోలీస్ కమిషనర్‌గా, నిఘా విభాగంలో ఐజీగానూ పని చేశారు. 2019-20 మధ్య ఏపీ పోలీస్ పర్సనల్ విభాగం ఐజీగా పని చేసి కేంద్ర సర్వీసులకు డిప్యుటేషన్‌పై వెళ్లారు. అక్కడ సీఆర్పీఎఫ్‌లో ఐజీగా నాలుగేళ్లపాటు పని చేసి, ఇప్పుడు ఏపీకి తిరిగొచ్చారు. ఈ నేపథ్యంలో బుధవారం ఏపీ సచివాలయంలో ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడును మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు.

# పట్టిసీమను జగన్ ఒట్టిసీమన్నారు.. ఇప్పుడదే బంగారమయింది: నిమ్మల

- కృష్ణాడెల్టాకు నీరు విడుదల చేసిన మంత్రి
- నదుల అనుసంధానానికి చంద్రబాబు శ్రీకారం చుట్టారు
- ఇరిగేషన్ వ్యవస్థను జగన్ విధ్వంసం చేశారు
- చుక్కనీరు కూడా వృథా కాకూడదనేది చంద్రబాబు ధ్యేయం



ఏలూరు: దేశాన్ని కరవు రహితంగా మార్చాలంటే నదుల అనుసంధానమే మార్గమని ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది సీఎం చంద్రబాబేనని చెప్పారు. పోలవరం ప్రాజెక్టుతోనే నదుల అనుసంధానం సాకారమన్నారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా డెల్టాకు సాగు, తాగునీటిని బుధవారం మంత్రి విడుదల చేశారు. యంత్రాలు, మోటార్లకు పూజలు నిర్వహించిన అనంతరం 4, 5, 6 పంపుల ద్వారా 1,050 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తరువాత పట్టిసీమ ఎత్తిపోతల పథకానికి సంబంధించిన ఛాయాచిత్ర ప్రదర్శనను మంత్రి పరిశీలించారు.

అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే నీటి వృథాను అరికట్టవచ్చన్నారు. ముంపు మండలాలను తెలంగాణ నుంచి ఆంధ్రాకు బదిలీ చేయించడం చంద్రబాబు ముందుచూపునకు నిదర్శనం. పట్టిసీమ ద్వారా ఏటా 80టీఎంసీల నీటి వినియోగం జరుగుతోంది. గతంలో పట్టిసీమను జగన్ ఒట్టిసీమ అన్నారు.. ఇప్పుడు అదే బంగారమైంది. కృష్ణా డెల్టాకు తాగు, సాగునీరు అందుతుందంటే అది పట్టిసీమ పుణ్యమే. ఇరిగేషన్ వ్యవస్థను జగన్ విధ్వంసం చేశారు. పట్టిసీమ నీటిని విడుదల చేయకపోతే లక్షలాది మంది దాహార్తిని ఎలా తీరుస్తారు? ఒక్క చుక్క నీటినీ వృథా చేయొద్దని సీఎం చెప్పారు. తాడిపూడి ఎత్తిపోతల పథకం ద్వారా 1.50 లక్షల ఎకరాలకు సాగునీరందిస్తున్నాం. ఏలేరు రిజర్వాయర్‌లో నీరుంటే స్టీల్ ప్లాంట్, విశాఖకు తాగునీరు అందుతుంది. ఏలేరులో నీటి నిల్వకు ప్రయత్నం చేస్తున్నాం. ఒకే రోజు నాలుగు పథకాల ద్వారా నీటిని విడుదల చేయడం చరిత్ర. అధికారులతో సమన్వయం చేసుకుని నీటి నిర్వహణ సమర్థంగా చేపడుతున్నాం. పోలవరం ఫలాలు పట్టిసీమ ద్వారా కొంతమేర కృష్ణా డెల్టాకు అందుతున్నాయని రామానాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి, ఐటీడీఏ పీవో సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.

# మూడు నెలల్లో 1.28 లక్షల గృహాల నిర్మాణం




- వచ్చే మార్చి నాటికి నిర్మాణంలో ఉన్న 8.02 లక్షల గృహాలను పూర్తి చేస్తాం
- లే అవుట్ల అభివృద్ధికి ఫ్లై యాష్ వినియోగించేందుకు చర్యలు
- ప్రతినెలా గృహ నిర్మాణ పథకాలపై అధికారులతో సమీక్ష
- రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కె.పార్థ సారధి

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక కింద వచ్చే మూడు మాసాల్లో లక్షా 28వేల గృహాలను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖామాత్యులు కె.పార్థసారథి వెల్లడించారు. ఈమేరకు బుధవారం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖపై అన్ని జిల్లాల ప్రాజెక్టు డైరెక్టర్లు, ఎస్ఇ, ఇఇలు ఆశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు. అనంతరం రాష్ట్ర సచివాలయం నాలుగోవ భవనంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని ప్రభుత్వ శాఖలు 100 రోజుల కార్యాచరణను రూపొందించుకోవాలన్న ఆదేశాలకు అనుగుణంగా గృహ నిర్మాణ శాఖకు సంబంధించి 100 రోజుల కార్యాచరణ కింద రానున్న మూడు మాసాల్లో 1.28 లక్షల గృహాలను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు పునరుద్ఘాటించారు. ఇందుకుగాను 2వేల 520 కోట్లలన ఖర్చు చేయనున్నట్లు మంత్రి పార్థసారధి తెలిపారు.

రాష్ట్రంలో వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న 8.02 లక్షల గృహాలను వచ్చే మార్చి నెలాఖరుకు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్టు మంత్రి పార్థసారధి చెప్పారు. గృహ నిర్మాణాలు జరిగే లేఅవుట్ల అభివృద్ధికి సంబంధించి విశాఖపట్నం, విజయవాడ,నెల్లూరు,రాయల సీమల్లోని థర్మల్ పవర్ స్టేషన్ల నుండి వచ్చే ఫ్లై యాష్ వినియోగించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి పార్థ సారధి పేర్కొన్నారు. ఆప్షన్-3 కింద నిర్మాణంలో ఉన్న గృహాలకు సంబంధించిన సమస్యలపై ముఖ్యమంత్రి వర్యులతో మాట్లాడి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి వివరించారు.

రాష్ట్రంలో వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న గృహాలను వేగవంతంగా పూర్తి చెయ్యటానికి అధికారులందరూ కృషి చేయాలని ఆదేశించామని మంత్రి పార్థ సారధి చెప్పారు. గృహ నిర్మాణాలకు సంబంధించి ఈ నెలాఖరులోగా రీకన్సిలేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. ఇకమీదట ప్రతి నెలా గృహ నిర్మాణాల ప్రగతిని అధికారులతో సమీక్షించడం జరుగుతుందని అన్నారు.

### రాష్ట్రంలోని పేదలందరికీ సొంతిటి కలన సాకారం చేస్తాం...

అంతకు ముందు రాష్ట్ర సచివాలయం 5వ భవనంలో జరిగిన గృహ నిర్మాణశాఖ మంత్రి పార్థసారథి మాట్లాడుతూ... రాష్ట్రంలోని పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కట్టుబడి ఉందని ఆదిశగా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అర్హులందరికీ గృహాలు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం ధృఢ సంకల్పంతో ఉందని... గృహ నిర్మాణాలను వేగవతంగా పూర్తి చేసేందుకు క్షేత్రస్థాయిలో అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో ముఖ్యంగా 2015లో ప్రారంభమైన ప్రధాన మంత్రి ఆవాస్ యోజన,(అర్బన్) పథకం క్రింద జిల్లాల్లో గృహ నిర్మాణాల ప్రగతిని, రాష్ట్ర వ్యాప్తంగా గృహ నిర్మాణాల వంద రోజుల ప్రణాళికపై నియోజక వర్గాల వారీగా మంత్రి సమీక్షించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి లబ్దిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవాలని కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సిన నిధులు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. గృహ నిర్మాణ శాఖలో ఉన్న ఖాళీలను ప్రస్తావిస్తూ పదోన్నతుల ద్వారా ఖాళీలను భర్తీ చేయాలని, క్రింది స్థాయి ఖాళీలను జిల్లాల నుంచి లేదా డిప్యుటేషన్ ద్వారా భర్తీ చేయాలని ఉన్నతాధికారులకు సూచించారు. గృహ నిర్మాణ పథకాల అమలుకు సిబ్బంది కొరత లేకుండా చూడాలని మంత్రి పార్థసారధి అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమా వేశంలో ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, ప్రత్యేక కార్యదర్శి మైదీన్ దివాన్, ఎండి గిరీషా, పీడీలు, ఎస్ఇలు, ఇఇలు తదితర అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో గంజాయి నియంత్రకు మంత్రుల సబ్ కమిటీ

**నేడు రాష్ట్ర సచివాలయంలో భేటీ**

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నియంత్రణకు మంత్రుల సబ్ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన ఏర్పాటు చేయబడిన ఈ సబ్ కమిటీలో రాష్ట్ర మానవ వరుల అభివృద్ధి,ఐటీశాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సభ్యులుగా ఉన్నారు. ఈ సబ్ కమిటీ తొలి సమావేశం 4వ తేదీ గురువారం రాష్ట్ర సచివాలయం ఐదో బ్లాక్ మొదటి అంతస్తులో ఉదయం 11.00 గంటల నుండి జరుగనుంది. ఈ సమావేశంలో రాష్ట్ర డీజీపీ, సిఐడి, ఇంటెలిజెన్సు అదనపు డీజీలు, సెబ్ డైరెక్టర్ పాల్గొంటున్నారు. రాష్ట్రంలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నియంత్రణకు తీసుకోవాల్సిన పటిష్టమైన చర్యలపై మంత్రుల సబ్ కమిటీని ఈ సమావేశంలో చర్చించనుంది.

## గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష వాయిదా

అమరావతి: ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష వాయిదా పడింది. పాలనాపరమైన కారణాలతో వాయిదా వేశామని, పరీక్ష తేదీని త్వరలో వెల్లడిస్తామని ఏపీపీఎస్సీ పేర్కొంది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 28న గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష జరగాల్సి ఉంది. ఏప్రిల్లో గ్రూప్ 2 ప్రిలిమ్స్ ఫలితాలు విడుదల కాగా.. మెయిన్స్కు 92వేల మందికి పైగా క్వాలిఫై అయిన విషయం తెలిసిందే. మరోవైపు, గ్రూప్-2 మెయిన్స్ వాయిదా వేయాలంటూ అభ్యర్థుల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్లు వచ్చాయి. సిలబస్‌లో మార్పులు చేయడం, ఎన్నికల ప్రక్రియ వల్ల పూర్తి స్థాయిలో పరీక్షకు సన్నద్ధం కాలేకపోయామంటూ పరీక్షకు మరికొంత సమయం పెంచాలని పలువురు ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. నిరుద్యోగుల అభ్యర్థనల దృష్ట్యా సానుకూల నిర్ణయం తీసుకోవాలంటూ పలువురు ప్రజాప్రతినిధులు సైతం విజ్ఞప్తి చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో పరీక్షలు వాయిదా వేస్తూ ఏపీపీఎస్సీ నిర్ణయం తీసుకుంది

## జగన్ కేసులపై రోజువారీ విచారణ
### తెలంగాణ హైకోర్టు ఆదేశం



హైదరాబాద్: ఏపీ మాజీ సీఎం జగన్ అక్ర మాస్తుల కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. సీబీఐ ప్రత్యేక కోర్టులో ఉన్న జగన్ అక్రమాస్తుల కేసులపై రోజువారీ విచారణ చేపట్టాలని తెలంగాణ హైకోర్టు ఆదేశాలు బుధవారం జారీ చేసింది. గత విచారణకు, ఇప్పటికీ ఎలాంటి పురోగతి కనిపించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేసింది. మాజీ సీఎం జగన్‌పై ఉన్న సీబీఐ కేసుల్లో ఇంకా విచారణే మొదలు కాలేదని, త్వరితగతిన విచారణ పూర్తి చేసేలా ఆదేశాలు ఇవ్వాలని మాజీ ఎంపీ హరిరామ జోగయ్య గతేడాది దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు విచారణజరిపింది. విచారణలో ఎలాంటి పురోగతి లేదని పిటిషనర్ తరపు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా... రోజు వారీ విచారణ చేపట్టాలని తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

## ఏపీపీఎస్సీ ఛైర్మన్ గౌతమ్ సవాంగ్ రాజీనామా

అమరావతి: ఏపీపీఎస్సీ ఛైర్మన్ గౌతమ్ సవాంగ్ తన పదవికి బుధవారం రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆమోదించారు. వైసీపీ హయాంలో



సవాంగ్ కొంతకాలం డీజీపీగా కొనసాగారు. 2019 మే నుంచి 2022 ఫిబ్రవరి వరకు పదవిలో ఉన్న ఆయన ఉద్యోగ విరమణకు రెండేళ్ల ముందే రాజీనామా చేశారు. అనంతరం సవాంగ్‌ను అప్పటి వైసీపీ ప్రభుత్వం ఏపీపీఎస్సీ చైర్మన్ గా నియమించింది. 2022 మార్చిలో ఆయన బాధ్యతలు చేపట్టారు. సవాంగ్ డీజీపీగా ఉన్న సమయంలో వైసీపీతో పూర్తిగా అంటకాగారు. ప్రతిపక్షనేతగా చంద్రబాబు అమరావతికి వెళ్తే వైసీపీ కార్యకర్తలు రాళ్ళు విసిరిన ఘటనపై సవాంగ్ స్పందించిన తీరు విమర్శలపాలయింది. భావ ప్రకటనా స్వేచ్ఛలో భాగంగా నిరసన తెలిపేందుకే రాళ్లు విసిరారని గౌతం సవాంగ్ సమర్థించారు.

# ఢిల్లీ చేరుకున్న సీఎం చంద్రబాబు

- ఎన్డీయే ఎంపీలకు విందు ఇచ్చిన ముఖ్యమంత్రి
- నేడు ప్రధాని, కేంద్రమంత్రులతో భేటీ



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా బుధవారం రాత్రి ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి ఢిల్లీ విమానాశ్రయంలో పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికిన హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, పక్కన కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్.

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు దేశ రాజధాని ఢిల్లీ చేరుకున్నారు. గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీ చేరుకున్న ఆయన అశోకా రోడ్డులోని 50వ నెంబర్ బంగ్లాలో బస చేశారు. రాష్ట్రానికి చెందిన ఎన్డీఏ ఎంపీలకు విందు ఇచ్చారు. షెడ్యూల్‌లో భాగంగా గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు పలువురు కేంద్రమంత్రులతో సీఎం చంద్రబాబు భేటీ కానున్నారు. ఉదయం 10.15 గంటలకు ప్రధాని మోదీతో సమావేశమవనున్నారు. ఆ తర్వాత రక్షణ, హోం, ఉపరితల రవాణా, వాణిజ్య, గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి శాఖల మంత్రులను కలవనున్నారు. శుక్రవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఆయన కలవనున్నట్లు సమాచారం. రాష్ట్రానికి సంబంధించిన సమస్యలపై ప్రధాని మోదీ, సంబంధిత శాఖల వద్ద సీఎం చంద్రబాబు ప్రస్తావించనున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై నివేదికలు ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. కేంద్రం త్వరలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రయోజనం జరిగేలా కేటాయింపులు జరపాలని కోరనున్నారని సమాచారం. ఇక విభజన హామీల అమలు, పోలవరం ప్రాజెక్టు నిధులు, రాష్ట్రానికి ప్రత్యేక ఆర్థిక సాయం, ఆహార శుద్ధి యూనిట్ల ఏర్పాటుకు సహకారం, పారిశ్రామిక రాయితీలు, మౌలిక వసతుల కల్పన, ప్రాజెక్టుల మంజూరు వంటి అంశాల్లో సహకారం అందించాలని కోరనున్నారు.

## ప్రజల కష్టాలు, కన్నీళ్ల నుంచి పుట్టిందే
# ప్రజాదర్బార్
### కొత్తగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు దిక్సూచి నారా లోకేష్





అమరావతి (చైతన్యరథం): జగన్ అరాచక పాలనలో రాష్ట్ర ప్రజలకు నరకం చూపించారు. ప్రజలు పడుతున్న కష్టాలను యువగళం పాదయాత్ర ద్వారా ప్రత్యక్షంగా చూసిన యువనేత నారా లోకేష్ మీవెంట నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. విధ్వంసక పాలనలో బాధితులుగా మారిన లక్షలాది ప్రజలకు యువనేత అండగా నిలిచారు. అ స్ఫూర్తితోనే తొలిరోజు నుంచే యువనేత లోకేష్ ప్రజాదర్బార్‌ను ప్రారంభించారు. ఎటువంటి ఆంక్షలు లేకుండా ప్రతిరోజూ ఉదయం వందలాది ప్రజలు యువనేతను కలుసుకొని తమ సమస్యలను ఏకరువు పెడుతున్నారు. లోకేష్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు మార్గదర్శకంగా నిలుస్తోంది. కష్టాల్లో ఉన్న ప్రజలకు నమ్మకం, భరోసా కల్పించేవాడే నిజమైన నాయకుడని లోకేష్ నిరూపిస్తున్నారు. ఇప్పుడు లోకేష్‌ను మంగళగిరి ప్రజలు తమ ఆత్మబంధువుగా భావిస్తున్నారు. ఏ కష్టమొచ్చినా చెప్పుకోవడానికి తమకు ఓ పెద్దదిక్కు ఉందని ఉండవల్లి నివాసానికి క్యూ కడుతున్నారు. ప్రజలకు చేరువ కావడానికి ప్రజాదర్బార్ సరైన మార్గమని భావించి అదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు యువనేత బాటలో పయనించేందుకు సిద్ధమవుతున్నారు. దీనిద్వారా నిత్యం ప్రజల్లో ఉండటం ఒక ఎత్తయితే, ఇప్పటి వరకు నిద్రావస్థలోవున్న అధికార యంత్రాంగంలో జవాబుదారీ తనం పెరుగుతోంది. ప్రజాదర్బార్ దృష్టికి వచ్చిన సమస్యలపై సమాధానం చెప్పకపోతే నిలదీస్తారన్న ఉద్దేశంతో అన్ని విభాగాలు అప్రమత్తమయ్యాయి. నాయకుడి పనితీరు ఆధారంగానే వ్యవస్థలు పనిచేస్తాయనడానికి నారా లోకేష్ నిలువెత్తు నిదర్శనం.

# గనుల శాఖ ఫైళ్లు, హార్డ్ డిస్కులు దగ్ధం

- కృష్ణా తీరాన దుండగుల దురాగతం
- పెద్దిరెడ్డి అనుచరుల పనిగా అనుమానం

అమరావతి: గనులశాఖలో అక్రమాలను కప్పెట్టే దిశగా ఆధారాలను దగ్ధం చేసేందుకు అవినీతి తిమింగలాలు యత్నించాయి. విజయవాడ శివారు పెదపులిపాక కరకట్ట వద్ద ఫైళ్ల దహనం ఘటన కలకలం రేపింది. అవి మైనింగ్ శాఖకు చెందిన ఫైళ్లుగా గుర్తించారు. కృష్ణా నది ఇసుక తిన్నెల వద్ద బుధవారం రాత్రి కారు ఆపి ఫైల్స్ తగలబెడుతుండగా స్థానికులకు అనుమానం వచ్చింది. దీంతో అక్కడి వెళ్లి ప్రశ్నించడంతో కారులో వచ్చిన వారు పరార య్యారు. ఈ సమాచారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు తెలియడంతో ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. దగ్ధమైన ఫైళ్లు గనులశాఖకు చెందినవిగా గుర్తించారు. ఏపీ ఎండీసీ దస్త్రాలను మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులే దహనం చేయాలని చూశారని భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యం లో వాటిని కాల్చిపారేసే యత్నం చేసినట్లు తెలుస్తోంది. పలు ఫైళ్లు,హార్డ్ డిస్కులు కాలిపోయాయని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తెలిపారు. అధికారులు విచారణ చేపడితే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయన్నారు.



## పిల్లలపై పిడుగు పేరుతో...

# సాక్షిలో తప్పుడు రాతలు

### మండిపడ్డ టీడీపీ నేత విజయ్ కుమార్

- ఫీజులు చెల్లించకుండా విద్యార్థులను ఇబ్బంది పెట్టింది వైసీపీనే
- వైసీపీ ప్రభుత్వంలో దాదాపు రూ. 3,480 కోట్ల బకాయిలు
- డబ్బులు ఉన్నప్పుడు చెల్లిస్తామని అప్పుడు కల్లబొల్లి కబుర్లు
- 2023లో కట్టాల్సిన బకాయిలకు 2024లో బటన్ నొక్కినా డబ్బులు ఇవ్వలేదు
- తల్లుల ఖాతాల్లో డబ్బులు వేశామని మోసం
- ఇప్పుడు ఫీజుల బకాయిల పేరుతో సిగ్గులేని రాతలు



అమరావతి(చైతన్యరథం): టీడీపీ అధికారం చేపట్టి కనీసం 20 రోజులు కాకుండానే పిల్లలపై పిడుగు అంటూ సాక్షి పత్రికలో తప్పుడు రాతలు, అబద్ధపు వార్తలు రాయడానికి కనీసం సిగ్గుండాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్ కుమార్ మండిపడ్డారు. పత్రికలో తప్పుడు రాతలు రాస్తుంటే సాక్షి ఎడిటర్ బుర్రలేకుండా అబద్ధపు రాతలను ప్రోత్సహిస్తున్నారా అని విజయ్ కుమార్ ప్రశ్నించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యావసతి బకాయిలు దాదాపు రూ. 3,480 కోట్లు విద్యార్థులకు చెల్లించకుండా ఇబ్బంది పెట్టారని దుయ్యబట్టారు. తల్లుల ఖాతాల్లో డబ్బులు వేశామని చెప్పి మోసగించారన్నారు. మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ సాక్షి పత్రిక, వైసీపీ రెండు వేరు వేరు కాదు..రెండూ ఒక్కటే అన్నారు. వైసీపీ ఓడిపోయాక ఏం చేయాలో తెలియక చేతిలో పత్రిక ఉందని సిగ్గు, శరంలేని రాతలు రాస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ కట్టలేదని తప్పుడు రాతలు రాస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చి సోమవారానికి 19 రోజులే అయ్యింది. అప్పుడే సాక్షి రోత రాతలు రాస్తోంది. ఒక్క ఛాన్స్ అని జనాలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి వ్యవస్థలను సర్వనాశనం చేయడమే కాక ఖజానాను ఖాళీ చేసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి ఇప్పుడు ఇలా రాయించటం సిగ్గుచేటు. సాక్షికి ఎడిటర్ ఉన్నాడో లేడో... ఉంటే అతనికి బుర్ర ఉందో లేదో.. తప్పుడు రాతలను, అబద్ధపు రాతలను ప్రోత్సహిస్తాడా? సిగ్గు శరం లేకుండా సాక్షిలో వార్తలు రాస్తున్నారు కాబట్టే మైకు ముందుకు వచ్చి ప్రజలకు నిజం చెప్పాల్సిన దుస్థితి వచ్చిందని విజయ్ కుమార్ అన్నారు.

#### బకాయిలు పెట్టి.. రోత రాతలు

సాక్షిలో వచ్చిన కథనం ప్రకారం 2024 జూన్ నాటికి 3,480 కోట్లు విద్యార్థులకు ఫీజులు కట్టాలని చెబుతోంది. మూడు నెలలకు ఒకసారి కాలేజీలకు ఫీజ్ రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తానని చెప్పిన జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చి ఫీజులు కట్టకుండా వాయిదా వేసుకుంటూ వచ్చారు. గత సంవత్సరం 2023 జూన్ లో ప్రారంభమైన విద్యాసంవత్సరానికి కేవలం ఒక్క త్రైమాసికానికి మాత్రమే జగన్ ప్రభుత్వం డబ్బులు విడుదల చేసింది. అదికూడా 2023 జూన్ లో కట్టాల్సిన వాయిదాకు 2024న మార్చి 1న పామర్రులో బటన్ నొక్కారు కానీ.. డబ్బులు వేయలేదు. 2023 జూన్‌లో విద్యాసంవత్సరం ప్రారంభం అయితే 2024 మార్చి వరకు ఒక్క రూపాయి కూడా ఎందుకు చెల్లించలేదో జగన్‌రెడ్డే సమాధానం చెప్పాలి? సంవత్సరం పాటు బకాయి పెట్టి సిగ్గులేకుండా నేడు పిల్లలపై పిడుగు అంటూ రోత రాతలు రాస్తున్నారు. జగన్ రెడ్డి అప్పులు పెట్టి.. ఇప్పుడు కొత్తగా వచ్చిన ప్రభుత్వాన్ని 18 రోజుల్లోనే కట్టమని చెప్పడం కంటే దారుణం ఏమైనా ఉందా అని విజయ్ కుమార్ ప్రశ్నించారు.

9,64,066 మంది విద్యార్థులకు ఫీజులు కట్టకుండా జగన్‌రెడ్డి మోసం చేశాడు. జగన్‌రెడ్డి ఫీజులు కట్టకపోతే నానా అగచాట్లు పడి పిల్లలే ఫీజులు కట్టుకుని పరీక్షలు రాసుకున్నారు. సర్టిఫికెట్లు తీసుకున్నారు. మేము ఇప్పుడు దానికి పరిష్కారం కోసం చూస్తుంటే సిగ్గులేకుండా ఫీజులు కట్టలేదని సాక్షిలో రాస్తున్నారు. రాసే వార్త తప్పు, అబద్ధం అని తెలియడంలేదా. సాక్షి మేనేజింగ్ డైరెక్టర్ ఏం చేస్తున్నారు? 19 రోజుల్లోనే ఫీజులు కట్టాలని జగన్ రెడ్డి, ఆయన పత్రిక ఎలా అడుగుతాయి? తల్లిదండ్రుల అకౌంట్‌లో డబ్బులు వేయకుండా మళ్లీ రోత రాతలు రాస్తారా? చేయాల్సింది అంతా చేసి రాష్ట్రంపై, విద్యార్థులపై పిడుగులు వేసి వారిని ఇబ్బంది పెట్టారు. అందుకే దారుణంగా ఓడిపోయారు. మీ అస్మదీయు కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించుకుని, పిల్లల ఫీజులు ఎందుకు చెల్లించలేదు జగన్ రెడ్డీ? సంవత్సరం పాటు విద్యావసతి రూ. 1200 కోట్లు ఎందుకు వేయలేదు? మూడు త్రైమాసికాల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎందుకు బాకీ పెట్టి పోయావ్ జగన్ రెడ్డీ అని విజయ్ కుమార్ నిలదీశారు.

#### నీతిమాలిన రాతలు

సాక్షి పత్రికలో చెత్త రాతలు రాస్తుంటే మేము రోజూ దానికి సమాధానం చెప్పాలా? ఫిజికల్ బేస్డ్ పద్ధతిలో ఎప్పుడు డబ్బులు ఉంటే అప్పుడు చెల్లిస్తామని మీ ప్రభుత్వంలో సీఎస్‌గా ఉన్న జవహర్ రెడ్డి చేత చెప్పించిన విషయం అప్పుడే మరచిపోయారా. మీరు మాత్రం ఫీజికల్ బేస్డ్ లో పద్ధతిలో చెల్లిస్తారు. మేము మాత్రం మీరు పెట్టిన బకాయిలు ఒకేసారి చెల్లించాలా.. ఇదేమైనా న్యాయమా? మీరు ఉంచిపోయిన బకాయిలన్నీ చెల్లించడానికి ఖజానాను ఏమైనా నిండుకుండలా పెట్టిపోయారా. ఖజానాను ఖాళీ చేసి కొంచెమయినా ఇంగితం లేకుండా నీతిమాలిన రాతలు రాస్తున్నారు. రాష్ట్ర ప్రజలను దోచుకున్న డబ్బులన్నీ ఏం చేశారో ఎవరికీ తెలియదు. మూడు త్రైమాసికాల బకాయిలు అలాగే ఉన్నాయి. వసతి దీవెన బకాయిలు అలానే ఉన్నాయి. ఇంత అప్పు పెట్టి విద్యార్థుల ఉసురుపోసుకుని మళ్లీ సాక్షి పత్రికలో సిగ్గుమాలిన రాతలు రాస్తున్నారని విజయ్ కుమార్ విమర్శించారు.

#### సర్టిఫికెట్లు ఇవ్వాలని లోకేష్ ఆదేశం

విద్యావ్యవస్థ ప్రక్షాళనకు టీడీపీ ప్రయత్నిస్తోంది. ఎవరికీ ఏ విధమైన భారం పడకుండా ప్రభుత్వం చూస్తోంది. కచ్చితంగా ఫీజులన్నీ చెల్లిస్తాం.. ఫీజు బకాయిలున్నా సర్టిఫికెట్లన్నీ విద్యార్థులకు ఇవ్వాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మౌఖికంగా కాలేజీలను ఆదేశించారు. ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుతూ.. దశల వారీగా ఫీజులన్నీ చెల్లిస్తాం.. అందులో ఏ సందేహం లేదు.

ఏ వర్గాన్ని వదలకుండా అన్ని వర్గాలను నాశనం చేసి మళ్లీ చెత్త రాతలు రాస్తే వచ్చే ఓట్లు కాదు కదా ఉన్న ఓట్లు కూడా పోవడం ఖాయం. విద్యార్థుల్లో భయాందోళనలు సృష్టించడానికి వైసీపీ యత్నిస్తోంది. ఇకనైనా సాక్షి పత్రికలో ఇటువంటి తప్పుడు రాతలు మానుకోవాలి. ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వం ఇది. విద్యార్థులు ఏ రకమైనా అభద్రతా భావానికి లోనుకావద్దని విజయ్ కుమార్ తెలిపారు.

---

## జర్నలిస్టుల రాయితీ పాసులను పునరుద్ధరించాలి

- రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఎంపీ కలిశెట్టి వినతి



ఢిల్లీ: కోవిడ్ మహమ్మారి వ్యాప్తి చెందిన సమయంలో జర్నలిస్టులకు తాత్కాలికంగా రద్దుచేసిన రైల్వే రాయితీ పాసులను పునరుద్ధరించాలని, వృద్ధులకు రైల్ టికెట్ చార్జీలలో రాయితీని పెంచాలని, అలాగే శారీరక, మానసిక వికలాంగులకు రాయితీ అందించి సౌకర్యాలను పెంచడంతోపాటు దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన వికలాంగ ధ్రువీకరణ పత్రాలను అనుమతించాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు విజయనగరం టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఈ అంశాలకు సంబంధించి అశ్విని వైష్ణవ్‌కు అప్పల నాయుడు వినతిపత్రం అందజేశారు. ఇక నుంచి గుర్తింపు పొందిన జర్నలిస్టు లందరికీ రాయితీ పాసులను పునప్రారంభించాలని అప్పల నాయుడు అభ్యర్థించారు. కోవిడ్ మహమ్మారి వ్యాప్తి చెందిన సమయంలో రైల్వే మంత్రిత్వ శాఖ జర్నలిస్టులకు రాయితీ పాసులను రద్దు చేసినప్పటి నుంచి ఎక్రిడేటెడ్ జర్నలిస్టులందరూ వార్తలు, కథనాలు, తదితర ప్రెస్ సంబంధిత పనుల కోసం సొంత ఖర్చులతో తిరుగుతున్నారని స్పష్టం చేశారు. అంతేకాకుండా రైలులో ప్రయాణం చేసేటప్పుడు అదనపు మద్దతు అవసరమయ్యే కొన్ని వర్గాల ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగు పరచవలసిన అవసరం ఉందని అప్పల నాయుడు ఆ లేఖ ద్వారా రైల్వే మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. శారీరక, మానసిక వికలాంగులకు రాయితీని అందించే సౌకర్యాలను పెంచాలని విజ్ఞప్తి చేశారు. సీనియర్ సిటిజనులకు రైల్ టికెట్ చార్జీల్లో రాయితీని పెంచాలని కోరారు.

---

## ఊరూరా మీసేవ!

- మహిళా స్వయం సహాయక సంఘాలకు మంజూరు
- ఇంటర్ చదివిన సభ్యురాళ్ల ఎంపిక
- ఒక్కో కేంద్రానికి రూ.2.50 లక్షల రుణం

అమరావతి (చైతన్యరథం): ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వ, ప్రైవేటుకు చెందిన వందలాది సేవలందిస్తున్న 'మీ సేవ'కేంద్రాలను ఊరూరా ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మహిళాశక్తి పథకం కింద రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు వీటిని మంజూరు చేయనుంది. కేంద్రాలు ఏర్పాటుకు ముందుకొచ్చే సంఘాలను ఎంపిక చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లను తాజాగా ప్రభుత్వం ఆదేశించింది. ఆగస్టు 15 నాటికి వీటిని ప్రారంభించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 4,525 మీ సేవ కేంద్రాలున్నాయి. వీటిలో మూడు వేల వరకు నగర, పట్టణ ప్రాంతాల్లో ఉన్నాయి. రాష్ట్రంలో 12,769 గ్రామ పంచాయతీలుండగా గ్రామాల్లో 1500 వరకే మీ సేవ కేంద్రాలు ఉన్నాయి. ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్ సేవలు, దరఖాస్తులు, చెల్లింపులు సహా 150కి పైగా ప్రభుత్వ,600కు పైగా ప్రైవేటు కార్యకలాపాల కోసం గ్రామీణ ప్రాంతాల ప్రజలు పట్టణాలు, నగరాల్లోని మీసేవ కేంద్రాలవద్దకు వెళ్లాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మహిళాశక్తి పథకం కింద మీసేవ కేంద్రాలను అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది.

#### గ్రామైక్య సంఘాల పేరిట..

గ్రామైక్య సంఘాల(విలేజ్ ఆర్గనైజేషన్) పేరిట మహిళా శక్తి మీసేవ కేంద్రాలను (ఎమ్మెస్ ఎమ్మెస్సీ) రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తుంది. కేంద్రం ఏర్పాటుకు రూ. 2.50 లక్షల రుణాన్ని స్త్రీనిధి ద్వారా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంజూరు చేస్తుంది. వీటితో ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణలో పేరొందిన కంపెనీల నుంచి కంప్యూటర్లు, ప్రింటర్లు, జీపీఎస్, బయోమెట్రిక్ పరికరాలు, కెమెరా, ఇంటర్నెట్ కనెక్షన్ కొనుగోలు చేయాలి. కేంద్రాలు ప్రారంభమైన తర్వాత ఆయా సంఘాలు రుణాన్ని నెలనెలా తిరిగి చెల్లించాలి. స్త్రీనిధి, స్థానికంగా ఉన్న గ్రామ పంచాయతీ, ప్రభుత్వ పాఠశాల, రైతు వేదిక, అంగన్వాడీ కేంద్ర భవనాలు లేదా ఇతర ప్రభుత్వ భవనాలు, వాటి ప్రాంగణాల్లో మీసేవ కేంద్రానికి 10 అడుగుల పొడవు, పది అడుగుల వెడల్పుతో వసతి కల్పిస్తారు. ఆయా సంఘాల్లో ఇంటర్ ఉత్తీర్ణులైన సభ్యురాళ్లను మీ సేవ ఆపరేటర్లుగా ఎంపిక చేస్తారు. కేంద్రం నిర్వహణ, సేవలపై మీ సేవ సంస్థ ద్వారా శిక్షణ ఇస్తారు. అనంతరం ఆయా మహిళా సంఘాలతో మీసేవ సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంటుంది.

---

## శ్రీ పురూహుతికా అమ్మవారిని దర్శించుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

పిఠాపురం (చైతన్యరథం): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ బుధవారం సాయంత్రం పిఠాపురం ప్రముఖ శక్తిపీఠం శ్రీ పురూహుతికా అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పిఠాపురం, ఉప్పాడ బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన వారాహి సభకు ముందు శ్రీపాద గయ క్షేత్రానికి విచ్చేసిన పవన్ కళ్యాణ్‌కి దేవాదాయశాఖ



అసిస్టెంట్ కమిషనర్ దుర్గాభవాని ఆధ్వర్యంలో అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. మొదట విఘ్నేశ్వరుడిని, శ్రీపాద శ్రీవల్లభుడిని, శ్రీ కుక్కుటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం శక్తిస్వరూపిణి అయిన పురూహుతికా అమ్మవారికి పూజలు నిర్వహించారు. అర్చకులు అష్టోత్తర పూజా నంతరం అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించి ఆశీర్వచనాలు అందచేశారు.

## పారిశుధ్యానికి తొలి ప్రాధాన్యం

**- గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



**గుంటూరు (చైతన్యరథం):** పశ్చిమ నియోజకవర్గంలో వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని పారిశుధ్యానికి తొలి ప్రాధాన్యం ఇస్తున్నాని, అధికారులు తనకు సహకరించాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యురాలు తెలిపారు. బుధవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 18వ డివిజన్ లో రామ నామక్షేత్రం, శ్రీనివాస్ రావు పేట,వెంగళ్ శెట్టి వారి వీధి, అడపా బజార్, మొహిద్దీన్ పాలెం, వడ్డే గూడెంలో ఉదయం 6.00 గంటలకే డివిజన్ పర్యటనకు గళ్ళా మాధవి శ్రీకారం చుట్టారు. స్వయంగా ద్విచక్ర వాహనమును నడుపు తూ, డివిజన్‌లోని ప్రధాన వీధులతో పాటు, సందులలో పర్యటించి ప్రజానమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భముగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ.. 18 డివిజన్ లో ప్రధానంగా తనకు డ్రైనేజి, వీధి దీపాలు, మంచి నీటి పైపుల లీకులు, రోడ్లు వంటి ప్రజానమస్యలు తన దృష్టికి వచ్చాయని. క్షేత్ర స్థాయిలో దీనిని పరిశీలించుటకు తాను వచ్చినట్లు తెలిపారు.మంచి నీటి పైపు లైన్ లో మురుగు నీరు కలవటం వలన డయేరియా వంటి ప్రాణాంతక రోగాలు ప్రబలిన ఘటనలను గత ప్రభుత్వంలో చూశామని, ఇప్పుడు అటువంటి ఘటనలు జరగటానికి వీలు లేదని, అధికారులు వీటి మీద దృష్టి పెట్టాలని, వర్షాకాలం దృష్ట్యా డ్రైనేజి నీరు రోడ్ల మీద పొంగకుండా మురుగు నీటి కాలువలను వెంటనే శుభ్రపరచాలని మాధవి ఆదేశించారు. ప్రజాసమస్యల విషయంలో నిర్లక్ష్యం వీడాలని, ప్రజలకు జవాబుదారీతనంగా ఈ ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చే విధముగా అధికారులు పనిచేయాలని గళ్ళా మాధవి కోరారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి వెంట సానిటరీ ఇన్స్పెక్టర్, వాటర్ ఏ.ఈ మరియు ఇతర అధికారులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో వనమా నరేంద్ర, ఉప్పుదల సాంబ, సానం రమేష్,మల్లె నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలి

**- ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**



**నందిగామ (చైతన్యరథం):** కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడంతో పేద విద్యార్థులు ఉన్నతమైన స్థానాలు అధిరోహిస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. బుధవారం నందిగామ ఓసి క్లబ్ లో జరిగిన నందిగామ, తిరువూరు డివిజన్ స్థాయి అన్ ఎయిడెడ్ ప్రైవేట్ యాజమాన్యముల ప్రాథమిక ప్రాథమికోన్నత మరియు ఉన్నత పాఠశాలల కరస్పాండెంట్ల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కొత్త ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేసిందని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ఫలితాలు సాధించాలని సూచించారు. త్వరలో మారోసారి విద్యాశాఖ అధికారులు, పాఠశాలల కరస్పాండెంట్లతో కలిసి కూలంకషంగా సమీక్షిస్తానని వివరించారు. ఈ కార్యక్రమంలో నందిగామ తిరువూరు డివిజన్లకు సంబంధించిన ఎంఈఓ లు మరియు పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.



**బండి ఆత్మకూరు మండలం సంత సింగవరం గ్రామంలో నిర్వహించిన " Thanks For Voting" కార్యక్రమం లో పాల్గొని గ్రామస్థులతో రచ్చబండ నిర్వహించిన శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ..**

# ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడమే మా లక్ష్యం !

- **ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి**
- **ఇనమడుగు పిహెచ్‌సిలో వసతులు మెరుగుపరుస్తా..**
- **కోవూరు మండలంలో మరో పిహెచ్సి ఏర్పాటుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం**



**కోవూరు (చైతన్యరథం):** నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా పనిచేయడమే తమ లక్ష్యమని కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. బుధవారం కోవూరు మండలంలోని ఇనమడుగులో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులకు అందిస్తున్న వైద్య సంబంధ విషయాలపై స్థానిక వైద్య సిబ్బందితో చర్చించారు. పరీక్షలకు సంబంధించి ల్యాబ్ టెక్నీషియన్ను అడిగి వివరాలు ఆరా తీశారు. ఇనమడుగు పిహెచ్‌సిలో అందిస్తున్న వైద్య సేవలు మరియు సిబ్బంది వ్యవహార శైలి గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు.అన్ని విభాగాలను పరిశీలించి వసతులు, సమస్యలను తెలుకున్నారు. ఈ సందర్భంగా రోగులను పరామర్శించి వారికి పండ్లు అందించారు. ఆరోగ్య వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేదికపై ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ... నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా పనిచేయడమే తమ లక్ష్యమని అన్నారు. ప్రస్తుతం కోవూరు మండలంలో 80 వేలమంది ఉండగా.. వాళ్లకు కేవలం ఒక పీహెచ్‌సీ మాత్రమే ఉందన్నారు. తప్పకుండా ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రెండో పిహెచ్‌సి ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు పేదలే వస్తుంటారని, వారి పట్ల ప్రేమగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. వైద్యారోగ్యం పై ప్రభుత్వం వేల కోట్లు వెచ్చిస్తోందని, అవి సద్వినియోగం అయ్యేలా బాధ్యతాయుతంగా పని చేయాలని ఆదేశించారు. ఇనమడుగు పిహెచ్‌సిలో స్థానిక డాక్టర్లు ఆమె దృష్టికి తెచ్చిన సమస్యలపై స్పందిస్తూ మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తానన్నారు. దేశంలోనే ప్రతిష్టాత్మక నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్ గుర్తింపు సాధించిన విడవలూరు మండలంలోని రామతీర్థం పిహెచ్‌సిని ఆదర్శంగా తీసుకొని ఉత్తమ ప్రమాణాలతో వైద్య సేవలు అందించాలని సూచించారు. స్థానిక సర్పంచ్ తదితర ప్రజా ప్రతినిధులు సైతం తరచూ ఆసుపత్రిని సందర్శించి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి నిరంజన్, సిబ్బందితో పాటు ఆశా వర్కర్లు, ఎఎన్ఎమ్ లతో పాటు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి, ఎంపీపీ పార్వతి, ఎంపీటీసీ కొల్లా సునీల్ రెడ్డి, సర్పంచి ప్రమీలమ్మ, ముఖ్య నాయకులు సుధాకర్‌రెడ్డి, గుత్తికొండ వెంకయ్య, దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, కమలాకరరెడ్డి, జనసేన నాయకులు గుడి శ్రీహరి రెడ్డి, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అధికారుల అలసత్వాన్ని క్షమించను : ఎమ్మెల్యే నసీర్ హెచ్చరిక



**- గుంటూరు తూర్పు నియోజకవర్గంలో విస్తృత పర్యటన**

**గుంటూరు (చైతన్యరథం):** పేద ప్రజల ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహించే శానిటేషన్ అధికారులను, అలాగే పేద ప్రజల ప్రాణాల పట్ల నిర్లక్ష్యం వహించే విద్యుత్ అధికారులను విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే క్షమించనని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. మంగళవారం స్థానిక మూడో వార్డులోని బాలాజీ నగర్‌లో గల రాజీవ్ గృహకల్ప ప్లాట్ల సముదాయాన్ని అధికారులు మరియు కూటమి నాయకులతో కలిసి సందర్శించారు. 2009లో ఏర్పడిన రాజీవ్ గృహకల్ప అపార్ట్మెంట్స్ సుమారు 384 ప్లాట్లు ఉన్న సముదాయమని గత పది సంవత్సరముల నుంచి ఈ కాలనీ ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని, అక్కడ స్థానిక ప్రజలతో మమేకమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్లాట్ల వెనుక చెత్తాచెదారం పేరుకుపోయి ఉండడాన్ని గమనించి శానిటరీ అధికారులను మందలించారు. అలాగే విద్యుత్ తీగలు వ్రేలాడబడుతూ ఉండటం, విద్యుత్ మీటర్లు సరిగా లేకపోవడం, ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా ఉండటాన్ని గమనించి విద్యుత్ అధికారులను తక్షణమే పరిష్కరించాలని హెచ్చరించారు. ప్లాట్ల లబ్ధిదారులు తమస్థల హద్దుల వరకు మాత్రమే క్రమబద్ధీకరించుకోవాలని తెలియజేశారు. దీనివల్ల ఇతర ప్లాట్ల వారికి అసౌకర్యం కలగకుండా ఉంటుందని అన్నారు, రాజీవ్ గృహకల్ప లోని ప్లాట్లకు నిరంతరం తాగునీరు సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, అంతర్గత రహదారులు వేయాలని శానిటేషన్ త్వరగా మెరుగుపరచాలని సీజనల్ వ్యాధులు సోకకుండా చూడాలని నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు.

ట్రాఫిక్ రద్దీని క్రమబద్ధీకరించండి

గుంటూరు నగరం తూర్పు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో వాహనదారులు, ప్రయాణికులకు నిత్యం ట్రాఫిక్ రద్దీతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇకపై అటువంటి సమస్యలు లేకుండా ట్రాఫిక్ పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని మహ్మద్ నసీర్ సూచించారు. ముఖ్యంగా హిందూ కాలేజీ కూడలి నుంచి బస్టాండ్ వరకు, హిమనీ సెంటర్ నుండి పట్నంబజార్ మీదుగా కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వరకు, పొన్నూరు రోడ్డు, నందివెలుగు రోడ్డులో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని గుంటూరు - చీరాల రోడ్డు, గుంటూరు - తెనాలి రోడ్డులోని నందివెలుగు - రైల్వే గేటు వద్ద ఓవర్ బ్రిడ్జిని త్వరగా పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. ఇరు శాఖల అధికారులు సమన్వయంతో వాహనదారులకు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలని వారం రోజులలో ఫలితం చూపించాలని ఎమ్మెల్యే నసీర్ అధికారులను ఆదేశించారు.

# బైక్ మెకానిక్ వర్కర్స్ నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

**- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.వీ.బీ రాజేంద్రప్రసాద్**




**ఉయ్యూరు (చైతన్యరథం):** బుధవారం ప్రపంచ టూవీలర్ దినోత్సవం సందర్భంగా ఉయ్యూరులోని మెకానిక్ సోదరులు ఏర్పాటుచేసిన కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.వీ.బీ రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం మెకానిక్ సోదరులు ఏర్పాటుచేసిన వల్లూరు రోడ్‌లోని శిరీష మానసిక అంగవైకల్య ఆశ్రమంలోని పిల్లలకు భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.... మానవునికి టు వీలర్ వాహనం అనేది నిత్యవసర వస్తువుగా మారిపోయిందని, అలాంటి వాహనం ఏదైనా ఇబ్బంది కలిగితే మొదటిగా గుర్తొచ్చేది మెకానిక్ అని, పేద మధ్య తరగతి కుటుంబం వారు పెద్ద పెద్ద షోరూంలలో తమ వాహనాలను రిపేర్ చేయించుకోలేని పరిస్థితుల్లో ఇలాంటి చిన్న తరహా మెకానికల్ దగ్గర తక్కువ ఖర్చుతో తమ వాహనాలను రిపేర్ చేయించుకోవడం జరుగుతుందన్నారు. ప్రపంచం అత్యాధునిక టెక్నాలజీతో దూసుకు పోతుందని, ఇప్పుడున్న వారు ఆ నూతన టెక్నాలజీని నేర్చుకుని బీఎక్స్ - 6 వాహనాలను కూడా రిపేర్ చేసే విధంగా నైపుణ్యతను సాధించాలని కోరారు. తాను అందరిని వాడనని ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటానని వై.వీ.బీ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

# ప్రధాని మోదీ ప్రసంగిస్తుండగానే విపక్షాల వాకౌట్

## - రాజ్యసభ ఛైర్మన్ ఆగ్రహం





**ఢిల్లీ:** ప్రతిపక్షాల తమ ప్రవర్తనతో రాజ్యసభను అవమానపర్చాయని ప్రధాని మోదీ దుయ్యబట్టారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని మోదీ బుధవారం రాజ్యసభలో సమాధాన మిచ్చారు. అయితే, ఆయన మాట్లాడుతుండగా... విపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తూ వాకౌట్ చేశాయి. దీనిపై ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని మోదీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వారు రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాస్తున్నా రంటూ ఛైర్మన్ దుయ్యబట్టారు.

**మర్యాదను విడిచి వెళ్లారు: ఛైర్మన్ ఆగ్రహం**

ప్రధాని మోదీ ప్రసంగంపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ విపక్షాలు ఆందోళన చేపట్టాయి. ప్రతిపక్ష నేతకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విపక్ష ఎంపీలు గట్టిగట్టిగా నినాదాలు చేశారు. వారి ఆందోళన నడుమే మోదీ ప్రసంగం కొనసాగించగా... ప్రతిపక్ష ఎంపీలు సభ నుంచి వెళ్లిపోయారు. దీంతో మోదీ ప్రసంగాన్ని నిలిపివేశారు. ఈ పరిణామాలపై రాజ్యసభ ఛైర్మన్ మాట్లాడుతూ... విపక్ష నేతలు సభను కాదు... మర్యాదను విడిచి వెళ్లారు. ప్రజాస్వామ్యాన్ని అవమానించారు. సభలో ప్రతి సభ్యుడికి అవకాశం ఇస్తున్నాం. కానీ, వారు రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాస్తున్నారు. రాజ్యాంగంపై హేళనగా ప్రవర్తించడం సమంజసం కాదు. రాజ్యాంగం అనేది చేతిలో పుస్తకం కాదు. జీవితానికి మార్గదర్శకం" అని విపక్షాలపై మండిపడ్డారు. అనంతరం మోదీ తన ప్రసంగాన్ని కొనసాగించారు.

**అవును... మాది మూడోవంతు ప్రభుత్వమే: మోదీ**

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీపై ప్రధాని మరోసారి విమర్శలు గుప్పించారు. "దాదాపు 60 ఏళ్ల తర్వాత దేశంలో పదేళ్ల పాటు అధికారంలో ఉన్న పార్టీ వరుసగా మూడోసారి విజయం సాధించింది. ఇది సాధారణ విషయం కాదు. పదేళ్లుగా సేవాభావంతో ఎన్డీయే ముందుకెళ్తోంది. 'మా పాలనను ప్రజలు మరోసారి సమర్థించారు. దేశానికి సేవ చేసే వారినే ప్రజలు ఆశీర్వదించారు. మాపై వారు చూపిన విశ్వాసానికి గర్వంగా ఉంది. ఓటర్లు సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చి... విభజన ఎజెండాను ఓడించారు. ఈ పరిణామాలతో కొందరు (కాంగ్రెస్) అసంతృప్తిగా ఉన్నారు. దేశ ప్రజల నిర్ణయాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఫలితాలు వచ్చినప్పటి నుంచి ఓ కాంగ్రెస్ నేత పదే పదే మమ్మల్ని 'మూడో వంతు ప్రభుత్వం' అని విమర్శిస్తున్నారు. అది నిజమే... మేం పాలనలో పదేళ్లు పూర్తి చేసుకున్నాం. మరో 20 ఏళ్లు అధికారంలో ఉంటాం. మూడో వంతు ముగిసింది. ఇంకా రెండు వంతులు మిగిలి ఉంది" అని మోదీ కాంగ్రెస్‌ను దుయ్యబట్టారు. విపక్షాల హయాంలో రిమోట్ కంట్రోల్ పాలన నడిచేదంటూ సోనియా గాంధీని ఉద్దేశిస్తూ ఎద్దేవా చేశారు. రాజ్యాంగం పై దాడి చేస్తున్నారంటూ ప్రతిపక్షాలు చేస్తోన్న ఆరోపణలను ప్రధాని తిప్పికొట్టారు. "రాజ్యాంగం అంటే కేవలం ఆర్టికల్‌ను అనుసరించడం మాత్రమే కాదు. అది 'లైట్‌హౌస్‌లా మనకు మార్గనిర్దేశం చేస్తుంది. రాజ్యాంగ భావనను విద్యార్థులకు చేరవేస్తున్నాం. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు అవుతోంది. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా ఉత్సవాలు జరపాలి" అని మోదీ వివరించారు. ఆర్థిక వృద్ధిలో భారత్‌ను పది నుంచి ఐదో స్థానానికి తీసుకొచ్చామని... రానున్న ఏళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థను మూడో స్థానానికి చేరుస్తామన్నారు.

## అవినీతిని నిర్మూలించేందుకు దర్యాప్తు సంస్థలకు పూర్తి స్వేచ్ఛ : ప్రధాని మోదీ

**ఢిల్లీ:** దేశాన్ని పట్టి పీడిస్తున్న నల్లధనం, అవినీతి భూతాన్ని నాశనం చేసేందుకు మరింత కఠినంగా వ్యవహరిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ రాజ్యసభలో ప్రకటించారు. అందుకోసం తమ సర్కార్ కేంద్ర దర్యాప్తు సంస్థలకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చిందన్నారు. తమపై మోదీ సర్కార్ ఈడీ, సీబీఐలను ప్రయోగిస్తోందని ప్రతిపక్షాలు కొంతకాలంగా ఆరోపణలు చేస్తుండడంపై ప్రధాని మోదీ తీవ్రంగా స్పందించారు. "దర్యాప్తు సంస్థలు నిజాయితీగా పని చేస్తాయి. ఏ అవినీతిపరుడు చట్టం నుంచి తప్పించుకోలేడు. ఇది మోదీ గ్యారంటీ. అవినీతి, నల్లధనాన్ని నిలువరించేందుకు కఠినచర్యలు తీసుకునేందుకు మా ప్రభుత్వం దర్యాప్తు సంస్థలకు పూర్తి స్వేచ్ఛనిచ్చిందని ఈ సందర్భంగా దేశ ప్రజలకు తెలియజేస్తున్నా.. వాటి చర్యల్లో మా సర్కార్‌కు ఎలాంటి పాత్ర లేదు" అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా దిల్లీ మద్యం కుంభకోణాన్ని ప్రస్తావించిన మోదీ... ఆమ్ ఆద్మీ పార్టీతో సహా కాంగ్రెస్‌పై మండిపడ్డారు. "ఆప్ అవినీతికి పాల్పడింది.

మద్యం కుంభకోణానికి తెర తీసింది. పలు కుంభకోణాలతో పాటు మరెన్నో దుశ్చర్యలకు పాల్పడింది. ఆప్ చర్యలపై కాంగ్రెస్ కూడా ఫిర్యాదు. చేసింది. కానీ, ఇప్పుడు ఆప్‌పై చర్యలు తీసుకుంటే మోదీపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి" అని ప్రతిపక్షాల తీరును దుయ్యబట్టారు. నాడు ఆప్ కుంభకోణాలకు సంబంధించిన సాక్ష్యాలను కాంగ్రెస్ మీడియా ముందు పెట్టిందని గుర్తు 'చేశారు. "ప్రస్తుతం ఆ రెండు పార్టీలు ఒక్కటయ్యాయి. ఆప్‌పై గతంలో హస్తం పార్టీ చెప్పినవి. 'సత్యాలా లేక అసత్యాలా! దీనిపై కాంగ్రెస్ వివరణ ఇవ్వాలి" అని ప్రధాని డిమాండ్ చేశారు. అవినీతి నిర్మూలనే ఎన్డీఏ లక్ష్యమని... ఎన్నికల్లో గెలుపోటములు తమకు ముఖ్యం కాదని పేర్కొన్నారు.

## జార్ఖండ్ ముఖ్యమంత్రి చంపాయి సోరెన్ రాజీనామా



**రాంచీ:** జార్ఖండ్ ముఖ్యమంత్రి చంపాయి సోరెన్ రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను గవర్నర్ రాధాకృష్ణన్‌కు అందించారు. భూ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో జనవరి 31న ఈడీ అధికారులు అప్పటి సీఎం హేమంత్ సోరెన్‌ను అరెస్టు చేయడంతో చంపాయి సోరెన్ ఆ బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. హేమంత్‌కు రాంచీ హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో జైలు నుంచి ఇటీవల ఆయన విడుదలయ్యారు. ఈ నేపథ్యంలో చంపాయి సోరెన్ నివాసంలో సమావేశమైన జేఎంఎం సారథ్యంలోని కూటమి ఎమ్మెల్యేలంతా హేమంత్ సోరెన్‌ను సభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నేపథ్యంలో హేమంత్ కొత్త సీఎంగా పగ్గాలు చేపట్టేందుకు వీలుగా ప్రస్తుత సీఎం చంపాయి సోరెన్ తన రాజీనామాను గవర్నర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రాజ్ భవన్ వద్ద ఆయన మాట్లాడుతూ... జేఎంఎం కూటమి తీసుకున్న నిర్ణయం మేరకు రాజీనామా చేసినట్లు తెలిపారు. తమ కూటమి బలంగా ఉందని చెప్పారు. హేమంత్ విషయంలో ఏం జరిగిందో అందరికీ తెలిసిందే. సంకీర్ణ భాగస్వామ్య పక్షాలు నాకు బాధ్యతలు అప్పగించాయి. ఇప్పుడు కూటమి హేమంత్ సోరెన్‌కు అనుకూలంగా నిర్ణయం తీసుకుంది" అని తెలిపారు. మరోవైపు, ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని గవర్నర్‌ను హేమంత్ కోరినట్లు తెలుస్తోంది.

## రాష్ట్రంలో 15 రోజుల వ్యవధిలో కూలిన ఏడు బ్రిడ్జీలు



**పట్నా:** బీహార్‌లో భారీ వర్షాలకు వంతెనలు కుప్పకూలుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా వరుస ప్రమాదాలు చోటుచేసుకోవడంపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. తాజాగా గండక్ నదిపై ఉన్న ఓ వంతెన కుప్పకూలిపోయింది. దీంతో మహారాజ్ గంజ్ నుంచి అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అయితే, ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం సంభవించ లేదని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గడిచిన 15 రోజుల వ్యవధిలోనే ఏడు బ్రిడ్జిలు కూలిపోవడం గమనార్హం. సివాన్ జిల్లా డియోరియా ప్రాంతంలో గండక్ నదిపై చిన్న వంతెన ఉంది. దీనికి కొన్ని రోజులుగా మరమ్మతులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం కొంతభాగం కూలిపోయింది. పది రోజుల క్రితం ఇదే జిల్లాలో ఓ వంతెన కూలిపోగా... ఇది రెండోది. ఈ బ్రిడ్జిని 1982-83 మధ్యకాలంలో నిర్మించారని, ప్రమాదానికి కల్పితమైన కారణాలపై దర్యాప్తు చేస్తున్నామని అధికారులు వెల్లడించారు. ఇటీవల కిషన్‌గంజ్ జిల్లాలో కంకయీ ఉపనదిపై నిర్మించిన ఓ వంతెన కుంగిపోయింది. దీంతో 'బహదుర్‌గంజ్, దిఘల్‌బ్యాంక్ బ్లాక్‌ల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అంతకుముందు. 'తూర్పు చంపారన్, సివాన్, అరారియా జిల్లాల్లో వంతెన ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఇలా పదిహేను రోజుల వ్యవధిలోనే వరుసగా ఏడు ప్రమాదాలు జరగడంపై రాష్ట్రవ్యాప్తంగా వంతెనల నాణ్యతపై ఆందోళన వ్యక్తమవుతోంది.

## హత్రస్ ఘటనపై జ్యుడిషియల్ విచారణ : సీఎం యోగి



**లఖ్‌నవూ:** ఉత్తరప్రదేశ్‌లోని హాత్రస్‌లో భోలే బాబా సత్సంగ్ కార్యక్రమంలో జరిగిన తొక్కిసలాట ఘటన దేశంలో పెనువిషాదం నింపింది. ఈ దుర్ఘటనలో 121 మంది మృతి చెందగా... వీరిలో ఆరుగురు ఇతర రాష్ట్రాల వారు ఉన్నట్లు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ బుధవారం వెల్లడించారు. ఆరుగురు మృతుల్లో హరియాణా నుంచి నలుగురు, మధ్యప్రదేశ్, రాజస్థాన్ నుంచి ఒక్కొక్కరు ఉన్నట్లు తెలిపారు. ఈ దుర్ఘటనపై విశ్రాంత హైకోర్టు జడ్జితో జ్యుడీషియల్ విచారణ జరుపుతామని ప్రకటించారు. న్యాయ విచారణ కమిటీలో విశ్రాంత అధికారులతో పాటు పోలీసు అధికారులు కూడా భాగంగా ఉంటారని తెలిపారు. ఈ విషాదానికి 'బాధ్యులెవరో గుర్తించడంతో పాటు, ఏదైనా కుట్ర ఉందా అన్న కోణంలోనూ దర్యాప్తు చేస్తారని వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకొనేలా నిబంధనలు రూపొందిస్తామని సీఎం తెలిపారు. 'హాత్రస్ జిల్లాలో భోలే బాబా పాద ధూళి కోసం జనం ఒక్కసారిగా ఎగబడటంతో మంగళవారం జరిగిన భారీ తొక్కిసలాట పలు కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. ఈ ఘటనలో ఇప్పటివరకు 121 మంది మృతి చెందగా... గాయాలపాలైనవారు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. అయితే, ఈ విషాదం తర్వాత భోలే బాబా పరారీలో ఉన్నారు. అతడి ఆచూకీ గుర్తించేందుకు పోలీసులు గాలిస్తున్నారు.

**సీబీఐ విచారణకు డిమాండ్ చేస్తూ హైకోర్టులో పిల్**

హత్రస్ తొక్కిసలాట ఘటనపై సీబీఐ విచారణ కోరుతూ అలహాబాద్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. గౌరవ్ ద్వివేది అనే న్యాయవాది ఈ పిల్ దాఖలు చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే జరిగిందని... ఇందుకు జిల్లా అధికారులే పూర్తి బాధ్యత అని ఆరోపించారు. ఈ వ్యవహారంపై న్యాయమైన విచారణ జరిగేలా సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. అలాగే, ఈ దుర్ఘటనపై ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ జరిపించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. డీజీపీ, హాత్రస్ డివిజనల్ కమిషనర్, జిల్లా మెజిస్ట్రేట్, ఎస్పీ, ఫులేరా పోలీస్ స్టేషన్‌లోని ఎస్‌హెచ్‌వోలను సస్పెండ్ చేసేలా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు. అయితే, ఈ పిటిషన్‌పై విచారణ తేదీని ఇంకా నిర్ణయించలేదని కోర్టు వర్గాలు పేర్కొన్నాయి.

## జికా వైరస్ కలకం.. రాష్ట్రాలకు కేంద్రం అడ్వైజరీ విడుదల



**ఢిల్లీ:** మహారాష్ట్రలో పలుచోట్ల జికా వైరస్ కేసులు వెలుగు చూడటం కలవరపెడుతోంది. ఇప్పటికే ఏడు కేసులు నిర్ధారణ అయినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వైరస్ వ్యాప్తిపై నిఘా పెట్టాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తూ అన్ని రాష్ట్రాలకు కేంద్ర ఆరోగ్యశాఖ అడ్వైజరీ జారీ చేసింది. ముఖ్యంగా గర్భిణీలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం, ఒకవేళ పాజిటివ్ వచ్చినట్లయితే పిండం. ఎదుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసింది. డెంగీ, చికెన్ గున్యా మాదిరిగానే దోమల ద్వారా జికా వైరస్ సంక్రమిస్తుంది. ఎడిస్ దోమలు కుట్టడం ద్వారా ఇది సోకుతుంది. ఇది ప్రాణాంతకం కాకపోయినప్పటికీ... ఇన్‌ఫెక్షన్ సోకిన మహిళకు పుట్టబోయే పిల్లలు తల చిన్నగా ఉండడం తోపాటు నాడీ సంబంధిత సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ఆ అయితే, 2018 నుంచి ఇటువంటి కేసు ఒక్కటీ కూడా దేశంలో వెలుగు చూడలేదని కేంద్ర ఆరోగ్యశాఖ పేర్కొంది.

జ్వరం, చర్మంపై దద్దుర్లు, కండరాలు, కీళ్ల నొప్పులు, తలనొప్పి, జీర్ణకోశ సంబంధ సమస్యలు, గొంతు నొప్పి, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తాయి. జికా కేసులు వెలుగు చూసిన ప్రాంతాల్లో ఉండే గర్భిణీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కేంద్ర ఆరోగ్యశాఖ అన్ని రాష్ట్రాలకు విజ్ఞప్తి చేసింది. 9 నివాస ప్రాంతాలు, పని ప్రదేశాలు, పాఠశాలలు, నిర్మాణ స్థలాలు, వైద్య ఆరోగ్య కేంద్రాల్లో వ్యాధి నియంత్రణ చర్యలు చేపట్టాలని అడ్వైజరీలో సూచించింది.